## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నారాయణపేట: సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 12వేల చెక్కును ధన్వాడ మండలంలోని పర్దిపూర్ గ్రామానికి చెందిన రాజుకు శుక్రవారం బీజేపీ రాష్ట్ర నేత నాగురావునామాజీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించడంలో కృషి చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందు నామాజీ తదితరులు పాల్గొన్నారు.

### బోరు మరమ్మతులు



మరికల్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రెండు నెలల నుంచి మరమ్మతులకు నోచుకుని తాగు నీటి బోరును ఎట్టకేలకు సిబ్బంది మరమ్మతులు చేశారు. శుక్రవారం పంచాయతీ సిబ్బంది బోరు మరమ్మతులు చేయడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూర్యమోహన్, చెన్నయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు సన్మానం



మాగనూర్: మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సతీష్‌కుమార్ బదిలీపై మక్తల్‌కు వెళ్లడంతో ఆయనకు కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా డీటీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఆయన ఎక్కడ పనిచేస్తున్న ఆయు ఆరోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ సురేష్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన పచ్చిమోసం..



మరికల్: రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెబుతూ పచ్చిగా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణ, అజయ్ కుమార్, వెంకటేష్, తిమ్మరాజు పాల్గొన్నారు.

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ భగవంతు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనచేసి ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోషం, వెంకటేష్, మహ్మద్‌రాజా, ఖాజా, అంజనేయులు, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిద్దాం



ఊట్కూరు: భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షిద్దామని హెచ్ఎం ముగ్దం జయప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సరస్వతీ శిశుమందిర్‌లో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటి వద్ద చదువు పట్ల శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేవిధంగా ప్రోత్సాహించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, పీవీ నర్సింహారెడ్డి, విశాల్, కిషోర్ పాల్గొన్నారు.

### బెదిరింపులపై ఫిర్యాదు

కోస్గి: పట్టణంలోని ఆరోవార్డులో డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీకి చెందిన అనిల్ కాలేకర్ అనే వ్యక్తి మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం మరోమారు కమిషనర్‌ను కలిసేందుకు కార్యాలయానికి వెళ్లగా కౌన్సిలర్లతో కలిసి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో తనపైనే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ కౌన్సిలర్ల సాక్షిగా కమిషనర్ తనను బెదిరింపులకు గురిచేశాడని బాధితుడు మరోమారు కలెక్టర్, కడా ప్రత్యేకాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.



భైరంకొండలో పూజలు చేస్తున్న మహిళలు



సింగారంలో పాలు పోస్తున్న మహిళలు



నేరడగంలో..

# భక్తిశ్రద్ధలతో నాగులపంచమి

నారాయణపేట రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగుల పంచమిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, దంపతులు తలంటు స్నానాలు ఆచరించి దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అక్కడ నాగదేవతలకు పూజలు చేశారు. పుట్టల్లో పాలు పోసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన**

మండలంలోని సింగారంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగుల పంచమిని పురస్కరించుకుని పండితులు మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సింగారంలో భవానిమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ అందజేశారు. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నాగులపంచమిని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బావుల వద్ద ఉండే నాగుల విగ్రహాలకు పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. ఊట్కూరులోని ఎనుకంపేట వీధి, పాతపేట, భరత్‌నగర్, శివాజీనగర్ తదితర ప్రాంతాలలో మహిళలు, చిన్నారులు నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు శారదమ్మ, యశోద, సావిత్రమ్మ, అశోక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాలో పూజలు చేస్తున్న భక్తులు

కృష్ణా: మండలంలోని కున్సిలో శుక్రవారం నాగుల పంచమిని మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. నాగుల విగ్రహాలకు అర్చకుడు శ్రీకాంతచారి ఆధ్వర్యంలో అభిషేకం, మహామంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శరణగౌడ, నల్లె నర్సప్ప, మాజీ సర్పంచ్ అంజప్పగౌడ్, సోమశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, వెంకట్‌రెడ్డి శరణప్ప, పిట్టల్ ప్రభు, రాంచందర్, మాణిక్యప్ప పాల్గొన్నారు.

మాగనూర్: నాగుల పంచమి వేడుకలను మండలంతోపాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు చిన్నారుల సైతం నాగుల వద్ద ప్రత్యేక పూజకార్యక్రమం నిర్వహించారు.

మరికల్: మండలంలో ఘనంగా నాగుల పంచమిని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక ఈశ్వర శివాలయంలో శుక్రవారం నాగుల విగ్రహాలకు మహిళలు పాలుపోసి పూజలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలను నిర్వహించుకున్నారు.



ఊట్కూరులో..



మరికల్‌లో..



సింగారంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నారాయణపేటలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్



మక్తల్‌లో నిల్వ ఉంచిన నీటిని పారబోయిస్తున్న డాక్టర్ విరోజ

నారాయణపేట రూరల్ /మక్తల్: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ విరోజ అన్నారు. మక్తల్ పట్టణంలోని ఏడో వార్డు రహమానియా కాలనీలో ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. అన్ని వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. చుట్టుపక్కల మురుగు ఉండటంతో వచ్చే రోగాలు తెలియజేశారు. నిల్వ ఉంచిన నీటిని చల్లి వేయించారు. మున్సిపల్ సిబ్బంది ఆంజనేయులు, బుక్‌కీపర్ భాగ్య, ఏఎన్ఎంలు సుజాత, పద్మ, ఆశాకార్యకర్త మంజుల పాల్గొన్నారు.

– అదేవిధంగా నారాయణపేట పట్టణంలోని 20వ వార్డులో డాక్టర్ బాలాజీరావు, మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో 'ఫ్రైడే- డ్రైడే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ బట్టి ఆంజనేయులుగౌడ్, ఏఎన్ఎం రేణుక, వైద్యసిబ్బంది తబితా, కరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

మాగనూర్: వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటివి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారిణి నాగజ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు వార్డుల్లో నిర్వహించిన డ్రై డే నిర్వహించారు. ఈ మేరకు..ఆమె చుట్టుపక్కల మురుగు ఉండటంతో వచ్చే రోగాలు తెలియజేశారు. అలాగే వర్కూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి పాల్గొని సిబ్బందితో వీధులను శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడారు.. ముఖ్యంగా వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమంలో ఏఎన్ఎం సుధా, ఆశకార్యకర్తలు అనంతమ్మ, సరిత, కృష్ణవేణి ఆశాకార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్‌లో శుక్రవారం ఎంపీడీఓ జానయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎం, పంచాయతీ అధికారులతో కలిసి శ్రమధానంలో భాగంగా వీధులను శుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఊట్కూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం అన్నారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. అలాగే పగిడిమారి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రత్యేకాధికారి సందర్శించారు. గ్రామంలో రోడ్ల పక్కన, ఖాళీస్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

నర్వ: గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం ద్వారా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రత్యేక అధికారి ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పాతర్చేడ్‌లో విద్యార్థులు, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణ, సదన్‌రావు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



పాతర్చేడ్‌లో



గుడెబల్లూర్‌లో



వర్కూర్‌లో

## సామాజిక అంశాలపై అవగాహన

ధన్వాడ: జోగిని, ఒంటరి మహిళలకు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు, సామాజిక అంశాలపై ఓఎంఐఎఫ్ (ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్) సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఓఎంఐఎఫ్ సమన్వయ కార్యకర్త హాజమ్మ మాట్లాడుతూ.. మహిళలు సమాజంలో వెనుకబడిపోవడానికి ప్రధాన కారణం నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, ఆర్థిక, మతపరమైన సమస్యలతో వెనుకబడిపోతున్నారని గుర్తుచేశారు. ప్రతి కుటుంబంలో బాలికలను బాలురతో సమానంగా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌నాయుడు, ఓఎంఐఎఫ్ నిర్వాహకులు రజనీ, రూపిక, మంగమ్మ, పవీణ, బాలమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం



పేటలో గ్రౌండ్ స్కూల్‌లో టీచర్లను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన టీచర్లను శుక్రవారం విద్యార్థుల బృందం ఘనంగా వీడ్కోలు పలికింది. అదేవిధంగా వారి స్థానంలో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురికి జీహెచ్ఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి మొక్కను బహూకరించారు.

నర్వ: మండలంలోని జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు బదిలీ కావడంతో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉస్మాన్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూరం వెంకటేష్, సంఘం నాయకులు సదన్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జంగంరెడ్డిపల్లిలో

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం

కొత్తకోట రూరల్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం లాంటివని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొ.జయశంకర్ సమావేశ మందిరంలో మదనాపురం, కొత్తకోట మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ విడతల వారీగా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. ఇప్పటికే రూ.1.50లక్షల వరకు రుణాలు ఉన్న మాఫీ చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్ష నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. కృష్ణారెడ్డి, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పీజే.బాబు, రావుల కర్ణాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి

## యువకులు క్రీడల్లో రాణించాలి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో యువకులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకుంటూ క్రీడల నిర్వహణపై ఆసక్తి పెంచుకోవడం సంతోషంగా ఉందని టీపీసీసీ కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని చంద్రగఢ్ కోటపై శుక్రవారం నిర్వహించిన ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. జాతర సందర్భంగా కబడ్డీ పోటీలను గ్రామస్తులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, విష్ణు, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, నల్లారెడ్డి పలువురు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పీఆర్సీ అమలు చేయాలి

మరికల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై మొదటి వారంలో ప్రకటించాల్సిన పీఆర్సీ ఇప్పటివరకు ఊసేలేదన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తపస్ మండల అధ్యక్షుడు సికిందర్, శ్రీను, జ్ఞానేశ్వర్, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న శేర్‌కృష్ణారెడ్డి

## పెండింగ్ డీఏను ప్రకటించాలి



కోస్గి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు చాలాకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తపస్ ఆధ్వర్యంలో కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. మండలాల ప్రతినిధులు అంజిలయ్య, వెంకటేష్, నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, నరేందర్, రవితేజ, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్‌ఐగా ఎస్ కృష్ణంరాజు

ఊట్కూరు: మండల ఎస్‌ఐగా శుక్రవారం ఎస్ కృష్ణంరాజు పదవీ బాధ్యతలు చేపట్టారు. జడ్చర్ల డీటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తూ ఊట్కూరుకు బదిలీపై వచ్చారు. నెలరోజుల క్రితం ఊట్కూరు ఎస్‌ఐ బి. శ్రీనివాసులు సస్పెండ్ కావడంతో కృష్ణ ఎస్‌ఐ నవీద్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

## తహసీల్దార్‌గా సతీష్‌కుమార్

మక్తల్: మండల తహసీల్దార్‌గా శుక్రవారం సతీష్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. మాగనూర్‌లో పని చేస్తున్న సతీష్‌కుమార్ మక్తల్‌కు బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల ప్రజలందరి సహకారంతో సేవలందించడం జరుగుతుందన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

కోస్గి: పట్టణంలోని 12వార్డు పరిధిలోని ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయందోళనకు గురవుతున్నారు. బహార్‌పేట జాండ్ర కమ్యూనిటీహాల్ ఎదుట ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని సిమెంట్ స్తంభం ఏర్పాటు చేశారు. కొత్త స్తంభాన్ని డ్రెయినేజీ గుంతలో ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం రెండు స్తంభాలు ఓ వైపు ఒంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వర్షకాలం నేపథ్యంలో విద్యుత్ స్తంభం షాక్ కొడుతుందని, ఈ విషయంలో విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని కౌన్సిలర్ శ్రీనివాస్‌తోపాటు కాలనీవాసులు వాపోతున్నారు. ఎవరికి ప్రమాదం జరగక ముందే విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని కోరుతున్నారు.



## వాహనాలకు బ్లాక్ ఫిలిమ్స్ కవర్లు తొలగింపు

మరికల్: మండల కేంద్రంలో పోలీసులు వాహనాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం మండలంలోని జాతీయ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాలను నిలిపి అద్దాలకు వేసిన బ్లాక్‌ఫిలిమ్స్ కవర్లను పోలీసులు తొలగించారు. వాహనాల్లో మద్యం సేవించి వెళ్తున్న వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి జరిమానా విధించారు. అనంతరం ఎస్‌ఐ మురళి మాట్లాడుతూ.. కారులో వెళ్తున్న వారు కన్పించేలా అద్దాలు వాహనాలు ఉండాలని, బ్లాక్ ఫిలిమ్స్ కవర్లు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కవరును తొలగిస్తున్న ఎస్‌ఐ మురళి

## ఆలయం ముస్తాబు



మరికల్: మండల కేంద్రంలోని రాయచూర్ రోడ్డు సమీపంలో ఆంజనేయస్వామి 2వ వసంతోత్సవ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. శనివారం ఆలయం వద్ద నిర్వహించే పూజ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థినికి అభినందన



మద్దూరు: క్రీడా పాఠశాలకు ఎంపికైన విద్యార్థిని మహిత జిల్లా కేంద్రంలో సమ్మర్ క్యాంప్‌లో నిర్వహించిన 800, 400 మీటర్ల పరుగు పందెంలో గెలుపొంది, ప్రభుత్వ క్రీడా పాఠశాలకు ఎంపికైయింది. క్రీడ పాఠశాలలో 4 వ తరగతితో చదువుతుంది. 3వ తరగతి వరకు మద్దూరులోని భాష్యం గ్రామర్ స్కూల్ చదువుకొవడంతో ఆ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థిని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పి. కవిత, హెచ్ఎం అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఒకేసారి రెండు ఉద్యోగాలు



రాజ్‌కుమార్

మరికల్: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించాడు. గ్రామానికి చెందిన సత్యమ్మ, కుర్మన్న కూలి పనులు చేస్తూ తన రెండో కుమారుడైన రాజ్‌కుమార్‌ను చదివించాడు. అయితే రెండురోజుల క్రితం వెలువడిన ఫలితాల్లో ఆయన టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓఆర్ఎస్ (టీపీబీఓ) ఉద్యోగంతోపాటు పంచాయతీ రాజ్ ఏఈఈ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆ యువకుడిని అభినందించారు.